వి ధి కృ త ము

శ్రీమతి అడపా సుగుణమణిగారు.

(అనుబంధకథ)

[నారాయణి తన యేకైకపుత్రియగు సువర్ణకు బాల్యవివాహము తలపెట్టి, భర్త సమ్మతించనందున రహస్యముగా శ్రీవిలాసునకిచ్చి పరిణయమొనర్చెను. ప్రఫుల్లుడీ సంగతి నెఱింగి, భార్యను పరిత్యజించి, ఆమె అంత్యకాలమున దర్శింపవచ్చి కుమార్తెను రమ్మని కబురంపెను కాని సువర్ణకు అత్త అనుమతి యివ్వనందున ఆమె రహస్యముగా రాత్రి బయలుదేరెను. భార్యమరణానంతరమున ప్రఫుల్లుడు సువర్ణను తోడ్కొని అత్తవారింటికేఁగి వారలు కుమార్తెను పరిగ్రహించనందున స్వగృహమునకు మఱలి, ఢిల్లీ పట్టణమున డాక్టరు పరీక్ష చదువుకొనుమని కుమార్తెను సాగనంపెను. కొంతకాలమునకు శ్రీవిలాసుడు తన భార్యను పంపుమని, లేదన్న కోర్టులో వ్యాజ్యము వేసెదనని భయపెట్టుటచే ప్రఫుల్లుడు కుమార్తెను రమ్మని ఉత్తరము వ్రాసెను. సువర్ణ తానింకను అవివాహితయని తన్ను ప్రేమించుచున్న సుదర్శనునకు సెలవుగైకొని బయలుదేరి, శ్రీవిలాసునితో తానింకను యతని భార్యగా నుండుట యసంభవమని వాదించును; కాని సుదర్శనుడు తననిజస్థితి నెఱింగి యవమానపరచుచు వ్రాసిన యుత్తరమును చూచి తన మనోభిప్రాయమును మార్చి యత్తవారింటి కరుగుటకై యాయత్తపడెను.]

బుద్ధిః కర్మానుసారిణీ; కర్మ పూర్వజన్మకృతము; జన్మ జీవితరింప నుపాయముగానక పడు అవస్థా రూపము.

సువర్ణ మనోవైక్లబ్యమున నుఱల నత్తవారింటి కరుదెంచెను కాని ఆమెకు మనసొకచోట, తనువొకచోట. హైమవతి మాతృమరణానంతరమున "రామా, కృష్ణా" అని జపమాల త్రిప్పుడం ప్రారంభించి సువర్ణ రాకను గని గృహకృత్యములలో పాల్గొనక సంతతం తనగదిలో కూర్చొనేది; తనలోకంఏదో తనది.

ఒకనాడు మధ్యాహ్నము శ్రీవిలాసుడు చీట్లాటలో విశేషముగా ధనము గోల్పోయి భోజనమునకై యింటికేతెంచెను. అప్పటికి సువర్ణా హైమవతులు వారివారి గదులలో పనులలో నిమగ్నలై యున్నారు. శ్రీవిలాసుడు స్నానమునకై దుస్తులను మార్చి, చేతచెంబుపట్టికొని వాకిటకువచ్చేసరికి అచ్చట నీరు సిద్ధముగా లేదు. కొంతసేపటివరకు కనిపెట్టి చూచేడు. ఎవరూవచ్చి సిద్ధముచేసే ఏర్పాటులో నున్నట్లుకూడా కానరాలేదు. అసలు మగవాళ్లకు కచ్చేరిలో చీవాట్లుతిని వచ్చినా, చీట్లాటలో ద్రవ్యము నష్టమైపోయినా ఇంటి ఆడవాళ్లమీదకదా ఆదమాయింపులు అలవాటు; ఇక కర్మమువాలక ఇంట కాస్త తప్పుకనపడినచో మరిచెప్పనవసరము లేదు. ఆవేళ రామరావణయుద్ధమే. శ్రీవిలాసునకు సువర్ణ గదిని సమీపించి ఆమెను పిలుచుటకు ధైర్యము చాలకపోవుటచే హైమవతి గదినిచేరి "ఏమే? ఇంటందరూ చచ్చేరా? నా రాకను తెలుసుకొనుటకై కళ్లులేవా? చెవులులేవా? మహా నిర్లక్ష్యంగా ఉంది

వ్యాపారం. స్నానానికైనా నీళ్లు పెట్టుటకు సమయము దొరకని ఉద్యోగాలు దొరికేయి," అని కేకలు వేసేడు.

హైమవతి శ్రీవిలాసునికన్నా రెండాకులెక్కువ చదువుకొన్నదే గనుక యేమాత్రమును తీసిపోలేదు. "ఒకే చేతగాని చవటా, కొఱమాలినపుంకా, ఎవరి మీదరా నీఏడుపు? పెళ్లాన్నొకమాటనలేవు మూతి పళ్లు రాలతంతుందని భయం. నెత్తినెక్కించుకొన్న తనువాళ దిగుమంటే దిగుతుందా? తలమాసినముండను, తీర్థయాత్రలకు పోతానంటే పోనివ్వకుండా మీయిద్దర క్రిందా చాకిరీ చేయించుకొనుటకట్రా అడ్డేవు? పెమ్చు రేగి ప్రేలిపోతున్నావుగాని ఎవరికిరా ఉద్యోగాలు పట్టి ఊగులాడుచున్నాయి? తీరకలేని ఉద్యోగం తగలబట్టే తిండికైనా వేళకురాలేక పోతున్నావు" అని కుక్కకాటుకు చెప్పుదెబ్బవలె జవాబుచెప్పింది.

శ్రీవిలాసునకు రౌద్రము ద్విగుణీకృతమైనది. "దెష్టా! ఏమంటే నోటికివచ్చినట్లల్ల వాగుచున్నావుశీ" అని చేతిలోనున్న చెంబుతో హైమవతి తలపై విసరికొట్టేడు. "అమ్మో! చచ్చేను" అని చావుకేక వేసి ఆమె నేలకూలింది. ఇల్లంతా రక్తమయమే. శ్రీవిలాసుడు చక్కా కాళ్లకు బుద్ధిచెప్పేడు. మూర్ఖులకు యౌగ్యతా యోగ్యత విచక్షణ శూన్యము.

సువర్ణ పరుగునవచ్చి వేడినీళ్లతో గాయమును కడిగి తనపెట్టెలోనున్న యౌషధులతో కట్టుకట్టి శైత్యోపచారములుచేసి హైమవతికి మఱల స్పృహ గలిగించింది.

"అమ్మా, సువర్ణా, నీదయవల్ల నాప్రాణాలు దక్కేయి. నీమేలు మఱచిపోలేనుతల్లీ. నీ ఖర్మమేమి కాలిందమ్మా నిక్షేపంలాటి ఇంటబుట్టి ఈ నిర్భాగ్యునకు భార్యవైనావు? నీగుణములను గుర్తించలేక నిన్ను నానాబాధలు పెట్టేను. నన్ను క్షమించు. ఇకముందు మనం ఒక్కతల్లికడుపున పుట్టినట్లే మెలగుదాం" అని ఆమె సువర్ణను కౌగిలించుకొన్నది.

శ్రీవిలాసుడు కంటబడితే హైమవతి పురాణం విప్పుతుందన్నభయముచే దొంగవలె దొడ్డిదారినివచ్చి భోజనముచేసి పోతుండేవాడు. ఇంట రంభనుబోలిన భార్య, తనకా బ్రహ్మచర్యము. పాపం ఏమిచేయగలడు? ఆమె అతనితో మనస్ఫూర్తిగా మాటలైనా అనదు.

ఒకనాటిరాత్రి సువర్ణ వంటచేయుచున్నది. పెద్ద కాపునకు నిండాజబ్బుగా నుందని కబురువస్తే హైమవతి పరామర్శకై వెళ్లింది. శ్రీవిలాసు డీసమయమును కనిపెట్టి వంటయింటికేగి "సువర్ణా నీకెంతటి కఠిన హృదయవు! నాతో నింకనైనను మనసిచ్చి మాట్లాడవా? నీ పరిరంభణ ప్రాప్తికై పడికాపులుపడియున్న నన్నాదరించవా? అని పరమాతురతతో కారులుకూయుచు సువర్ణను కౌగిలించబోయెను. ఆమె తనబలమునంతయు వినియోగించి శ్రీవిలాసుని వెనుకకుత్రోసివేసినది గాని అతడు మఱల దరియుటకై గమకించుచున్నాడు. సువర్ణ గత్యంతరము గానక గభీలున తలుపువేసుకొని గడియవైచి వంటయింట దాగున్నది.

కామాతురులకు కండ్లుకానరావు. శ్రీవిలాసుడు తలుపును బలవంతనుగా తన్నుచు "సువర్ణా తలుపు తెఱువుము; లేనిచో ఈ ద్వారమును ముక్కలుముక్కలుగా విఱిచిలైనను నిన్ను చేపట్టితీరదన"ని భయపెట్టుచుండెను. సువర్ణ వంటయింటనున్న కత్తిని సంగ్రహించి తలుపు విఱిగినచో ఆత్మహత్యచేసుకొనుటకై సంసిద్ధరాలై యుండెను. స్త్రీలహృదయములు పుష్పాదికన్నా మృదువు — వజ్రముకన్నా కఠినము.

హైమవతి గృహమునకు మఱలి, ఈదృశ్యము నవలోకించి తనసహజ వాగ్ధోరణి లంఘించుకొంది. "ఒరే నీ నెత్తికొట్ట, నీ పెదడు పేల్చ. ఐం గాయలాగున్న రైతుకు బాగులేదనిచెప్పి, నిలబడ్డపాటున నన్నింట నుండి తఱిమి, ఏమిట్రా ఈ దారుణం?" అని సమీ

1126

పించేసరికి "ఇక దీనినోట్లోనోరుపెట్టలే"నని ఆతలుపు తాళం వేసుకొని పోయేడు శ్రీవిలాసుడు.

అర్ధరాత్రయింది. ఊరుమాటుమణిగింది. ఆకాశమంతా మేఘావృతమై భోరున గాలివీస్తుంది. శ్రీవిలాసుడు నిద్రాపరవశుడైనాడు. హైమవతి వంటఇంటి కిటికీని విరిచి ఆదారిని సువర్ణను బంధవిముక్తిచేసి "అమ్మా, సువర్ణా ఇంక నీవీఇంట నుండుట శ్రేయస్కరము కాదు. కాలయాపనచేసినచో కడగండ్ల పాలయ్యెదవు. త్వరితముగ పుట్టిల్లు చేరుకొనుము" అని హెచ్చరించెను.

సువర్ణ హైమవతి పాదములపైబడి "అమ్మా, ఎన్నిజన్మములకైన నీఋణము తీర్చుకొనలేను. సమయమునకు నీవురాకున్నచో నాగతి యేమైయుండెడిదో ...ఇదిగో కడసారిసెలవు" అని ఆ గాఢాంధకారమున అదృశ్యరాలైనది.

స్త్రీలకు సమయోచితబుద్ధి మెండు.

౮

ప్రకృతి కడువిచిత్రమయినది. పోషించుబాధ్యత సమయించు అధిక్యత ఒక్కవస్తువులోనే రూపిస్తుంది. ఓర్పునకు పేరన్నికగన్నభూమి! ఒక్కొక్కప్పుడు ప్రళయకాలరుద్రునివలె కంపించి లక్షలకొలది ప్రజలను తనకుక్షి నిడుకొనుచున్నది. తల్లివలె సస్యములను పోషించి ప్రజలను కాపాడుజలము పెల్లుకొని ప్రవాహమై పల్లెలను పట్టణములను కొల్లగొనుచున్నది. అబలలచేతి ఆటవస్తువగు అగ్ని పెనుభూతమై గృహములను ఆహుతి యొనర్చుచున్నది.

భైరవీనది పొంగి పరిసరగ్రామముల నన్నిటిని ముంచి విశేషనష్ట మొనగూర్చినది. తినతిండి, కట్టుగుడ్డ నిలువనీడలేక ప్రజలు అల్లలాడుచున్నారు. విషూచి జాడ్యము, మున్నగు అంటువ్యాధులు విశేషముగా ప్రబలినవి. ఇంకను వర్షము సంతతధారగా కురియుచున్నది. రోగులచికిత్సార్థము ప్రభుత్వమువారు డాక్టరు సుదర్శనుని మరికొందరు అనుచరులను క్రొత్తగా నియమించేరు. సుదర్శనుడు అహోరాత్రములు కష్టపడి ప్రజలకువలయు సౌకర్యముల నొనగూర్చుచున్నాడు.

నాడు వర్షము కొంచెమాగినది. సుదర్శనుడు సాయంకాలము వాహ్యాళికై బయలుదేరి శిబిరమును వీడి సుమారొకమైలు పొలములలోనుండి నడచెను. నల్దిక్కులా అంధకారమావరిస్తుంది. మఱలిపోవుటకై యత్నించుసమయమున నొకశకట మాదెసకే వచ్చుచున్నట్లు కనబడెను. ఒకలేడీడాక్టరునుకూడా ఆ ఉద్యమములో తోడ్పడుటకై ప్రభుత్వమువారు నియోగించేరు కాని ఆమెఇంకనూ రాలేదు. బహుశా ఆబండీ ఆమెదై యుండనోపునని సుదర్శనుడు వేచియున్నాడు. దైవఘటన అవిలంఘనీయము. సువర్ణ ఆ బండినుండి దిగినది. ఒకరినొకరుచూచి చకితులైరి. కొంతవరకెవరినోటనుండీ మాటరాలేదు.

"సువర్ణా స్వాగతము. నీరాక ముందుగా తెలియబఱచకుండా బయలుదేరతావేమి? ఇక్కడనుండి శిబిరమునకు బండిపోదు. సామానంతయూ కూలివాండ్రచే పట్టించుకొని నడచివెళ్లాలి. చీకటికూడా పడ్డాది. పొలములలోనుండి నడవడం ప్రమాదకరము. దైవవశాత్తునే రాబట్టి కాని లేకున్న ఈ నిర్జనప్రదేశమున చాల కష్టపడియుందువు."

"నా ప్రయాణము బయలుదేరువరకూ నిశ్చయము కాలేదు. అదిగాక ఇక్కడింతఅవస్థ పడాలనికూడా తెలియదు."

సుదర్శనుడు కొందరి కూలివాండ్రను, రెండు లాంతరులను తక్షణము పంపుమని శిబిరమునకు ఉత్తరము వ్రాసి బండివానిద్వారా పంపించెను. సువర్ణా సుదర్శనులు ఆ సమీపమునకేఉన్న చిన్నవంతెన గట్టుపై కూర్చొని సంభాషణ కుపక్రమించేరు.

సువర్ణ అత్తవారింటినుండి పలాయనమైన తరువాత అధిక ప్రయాసముపై తండ్రిని చేరుకొన్నది. ఎండ కన్నెఱుంగని ఆ ఇల్లాలు అనేకకష్టములకు లోనౌటచే దేహదారుఢ్యము క్షీణించినది. వైద్యుల ఉద్దేశము ననుసరించి ప్రఫుల్లుడు ఆమెను భవానీ పురమునకు గొంపోయి కొంతకాలము చికిత్సలోనుంచెను. ఇంతలో ప్రభుత్వమువారు క్రొత్తగా నియమించిన శానిటారీ సంఘములో సువర్ణను లేడీడాక్టరుగా నియమించుచూ తక్షణమే ఉద్యోగములో ప్రవేశించుమని ఆజ్ఞాపత్రము పంపిరి.

"సువర్ణా, చాల తొందరపడి నిన్నవమానపఱచుచూ ఉత్తరము వ్రాసేను. నే చేసినది గొప్పపొరపాటు. నన్ను క్షమించాలి."

"ఇందు మీరొనర్చినదేమున్నది క్షమార్పణకు? కృత్రిమవేషం వేసుకొని మానవహృదయాన్ని హింసించినందుకు నేనే క్షమాపణకోరాలి."

"సువర్ణా ఇంకనూ నీకసి తీరలేదా? కుందిపడుచున్న నా మానసమును నిష్ఠురోక్తులతో నేల కలంచెదవు? మన పూర్వస్నేహమును జ్ఞప్తికి తెచ్చుకొని నన్ను మన్నించాలి."

"సుదర్శన్, ఎండమావులని ఎఱింగి నీటికై యింకనూ ఆశయేల? నే నొకనామమాత్రపు గృహిణిని. నా జీవితము కడువిహ్యమైనది. నావంటి దౌర్భాగ్యురాలీలోకముననుండబోదు. భగవంతుడు కలకాలము ఇట్లే జీవింపుమని మాడుపంక్తులా నా నుదుట వ్రాసేడు. ఇట్టి నికృష్టను చేబట్టి నీ యశశ్చంద్రికల నేల కలంకము చేసుకొనెదరు? మన పూర్వస్నేహమును స్వప్నగత వృత్తాంతముగ పరిగణించి స్వస్తిచెప్పవలసిందనే నా ఉద్దేశము."

"సువర్ణా నీవెంతటి వెఱ్ఱిదవు. మానవులు బుద్ధితక్కువచే చేయుపనుల ప్రతిఫల మనుభవించునపుడు విధి కృతముగా తలంచుట వెఱ్ఱితనము కాదా? ముక్కుపచ్చలారని పిల్లను మూన్నాళ్లముచ్చట చేసి ముదుసలికి ముడిపెట్టి భర్తమొగ మెఱుంగని దే బాలవితంతువని పించి "పూర్వజన్మమున ఏ పుణ్యదంపతుల నెడబాటు చేసెనో అనుభవింపక తప్పుతుందా?" అని అనడంలో అర్థంవుందీ? నీవే యోచించుకొనుము, యుక్తాయుక్త వివేచనగలదానవు. నా ఆశయముల నడుగంటనీయకుము. మన స్నేహలతకు దోహదమొసంగుటకు మారు కూకటివేళ్లతో పెకలింపకుము. శాస్త్రసమ్మతములు సానుకూలము కాకపోయినను సంఘము కత్తికట్టినను వెఱచి వెనుకంజవేయువాడను గాను. సువర్ణా నీకింకను సంశయము తీరలేదా?"

"సుదర్శన్, అదిగో కూలివాండ్రరుదెంచుచున్నారు. శిబిరమునుచేరి సావకాశముగా ఈ విషయమై ఆలోచిద్దాము. నాకుమాత్రమింకనూ శ్రీవిలాసుడన్న సింహస్వప్నము సుమా."

"ఇదేమి సువర్ణా స్వర్గమునకుపోయినను సవతి పోరేనా?" అని సుదర్శనుడు మందహాసమొనర్చెను.

సువర్ణ సిగ్గున తలవాల్చినది. స్త్రీలకు సిగ్గు సహజగుణము.

౯

లోకమునుమూయ మూకుడులేదు. సువర్ణ పలాయనవిషయమై భట్టుగ్రామమున ఆబాలగోపాలము పరిపరివిధముల చెప్పుకొనుచుండిరి. ఆమె ఎవరో డాక్టరును ప్రేమించుటవలననే అత్తవారింటినుండి అదృశ్యమైనదన్న వదంతి ఊరంతా మారుమ్రోగింది.

శ్రీవిలాసుడు సువర్ణజాడను తెలుసుకొనుటకై విశ్వప్రయత్నము మొనర్చి విఫల మనోరథుడయ్యెను. కొంతకాలమునకు వార్తాపత్రికలవలన ఆమె ఉనికిని కనుగొని ఎట్లయినను సుదర్శనుని కవమానపఱచి తన భార్యకు తగినబుద్ధి చెప్పవలయునని బయలుదేరెను.

నాడు చేయవలసినపని పూర్తియగుటచే సువర్ణ తన డేరాలో కూర్చొని విశ్రాంతిగైకొనుచున్నది. ఆమె

తన భావిజీవితసమస్యను పరిష్కారమొనర్చుటకై పరిపరి విధముల నాలోచించుచున్నది. ఒకప్రక్క నగ్ని సాక్షిగా వివాహమాడిన భర్త — వేరొకదెస మనస్ఫూర్తిగా ప్రేమించుచున్న ప్రియుడు.

ఇంతలో శ్రీవిలాసుడు ప్రత్యక్షమై వికృతహాసముతో సువర్ణనుద్దేశించి “ఆడుదానిగాపుట్టి బహు యోగ్యమైన పనిచేసేవు. తులసివనములో గంజాయి మొక్కవలె పేరుప్రతిష్ఠగల బ్రాహ్మణకులమునపుట్టి యిరువంశములవాళ్లకు మాయనిమచ్చతెచ్చి పెట్టేవు. నిన్ననవలసినపని లేదు. ఆ ముసలిపీనుక్కు బుద్ధి పెడతల పట్టబట్టి నిన్ను చదివించేడు. లేకపోతే ఆడుదానికి చదువేమిటికి? అందులో డాక్టరుపరీక్ష!! డాక్టరుపరీక్ష చదువుకొని సౌశీల్యమును కాపాడుకొనిన స్త్రీలను వ్రేళ్లపై లెక్కింపవచ్చు. నీవు ఉద్యోగములు చేసి ఊళ్లేలక్కరలేదు. ఇప్పటికి జరిగిందేచాలు. తలెత్తుకొని తిరుగలేకపోతున్నాము. ఇక దయచెయ్యం”డని పల్కెను.

సువర్ణ నిలువునీరయ్యెను; ధైర్యము తెచ్చుకొని “మీ రాడవలసినమాటల కిది సమయముకాదు; స్థలముకాదు. మనిషన్నవా డాడినమాటలకు సబబు సందర్భముండాలి. ఇది ప్రభుత్వపు శిబిరము కాని మీయిల్లు కాదు. మర్యాదగా మీరే దయచెయ్యం”డని ప్రత్యుత్తరమిచ్చెను.

“నేను కదలకపోతే మీసుదర్శనునితో చెప్పి వెళ్లగొట్టిస్తావేమో? రాతిపై త్రిదనమును మోచి గుఱ్ఱము మూడుకాళ్లతో నడిచిందట. ఆరునూరైనా నూరారైనా నీవు నాభార్యవు. ఈ బంధము తనువులతో నంతరించవలసినదేగాని తాత్కాలికము కాదు. లోకులు నిన్నుపహసించిన నన్నుగూడ నపహసించినట్లే. క్షణభంగురములగు తుచ్ఛసుఖముల కాసించి శాస్త్రవిరుద్ధముగ సుదర్శనుని చేపట్టినచో నీవొనర్చు దుర్ణయమునకు ప్రతిఫలముగ నీ కడుపునబుట్టిన బిడ్డలు గతిలేక కలకాలము నీప్రాణమున కేడ్చి చావవలసిందే”యని మఱల నుపన్యసించెను.

“మీ రనవసరప్రసంగమున కంతులేదేమో? నాకు తొందరపనియుంది; వెళ్ళా”లని సువర్ణ వైద్యశాలకుపోయెను.

గత్యంతరము లేక శ్రీవిలాసు డచ్చోటువాసెను.

ఇంకను కుంభవృష్టికురియుటచే సుదర్శనుడు శిబిరమునుమార్చు ప్రయత్నములోనుండెను. ఒక సేవకుడు పరుగున సుదర్శనునికడకేతెంచి “బాబూ, ఎవరో నాలా ఆపదలోనున్న రోగినితెచ్చి తమను తక్షణమే పిలువుమని బ్రతిమాలుచున్నా”డని చెప్పెను.

“ఏమి? అచ్చట లేడీడాక్టరుగారు లేరా?”

“లేరుబాబూ. ఎవరో ముసలివచ్చి తనకూతురికి బాగులేదని కాళ్లమీదపడి బ్రతిమాల ఆయమ ఇంటికివెళ్లేరు.”

“మీ రెందు కామె వెంట వెళ్లలేదు?

ఇదంతయును శ్రీవిలాసుని పన్నాగమైయుండునోపు. పదండి; కొంపమునిగిం”దని శరవేగమున పరుగెత్తెను.

సుదర్శను డనుచరులతో శిబిరమునువీడి భైరవీనది మధ్యమున ఒకనావ మందగమనమునపోవుచుండుట గమనించెను. దూరదర్శి యంత్రమునందు శ్రీవిలాసుడు బలవంతముగా సువర్ణను చెరగొనుచున్నట్లు కనుగొనెను. “రండు: ఆలసించినచో నాశాభంగము”నని త్వరితముగా దుస్తులమార్చి ఆప్రవాహమున దుమికి పడవను చేరుటకై ఈదుచుండెను.

శ్రీవిలాసు డీదృశ్యము నవలోకించి జాలరులకు ద్రవ్యాశచూపి నావను త్వరగ నడిపించుటకై యేర్పాటుచేసెనుగాని రెట్టింపయత్నించినను ప్రవాహవేగమున పడవనడువదయ్యెను.

సుదర్శను డనుచరులతో పడవను సమీపించుట గాంచి పడవలోనున్నవా రాందోళనతో నటూ యిటూ కదలుటవలన పడవ నీటమునిగినది.

సుదర్శనుడు సువర్ణను ప్రవాహమునుండి పైకితీసి శిబిరమునకు గొంపొమ్మని సేవకులకొసంగి శ్రీవిలాసునితో ముష్టియుద్ధమునకు కడంగెను.

ఇరువురును సమవయస్కులు; క్రోధఘూర్ణితమానసులు. మదపుటేనుగులవలె పోరి, యలసి, సొలసి స్పృహతప్ప ప్రవాహమున మునిగిపోయిరి.

సేవకులు చైతన్యహీనులైన సువర్ణాసుదర్శనులను శిబిరమునుచేర్చి వలయు వైద్యసహాయము నొసంగిరి.

కొంతసేపటికి సువర్ణ సేదదేరి "డాక్టరుగారే" రని చెంతనున్న సేవకుని ప్రశ్నించెను.

"అమ్మా, ఎన్నిమందులు వేసినను తెలివిరాలేదు. అపాయస్థితిలోనున్నారు. జీవించునను యోగలే"దని యేడ్చుచూ ప్రత్యుత్తరమిచ్చెను.

సువర్ణ దీర్ఘ నిట్టూర్పువిడచి "శ్రీవిలాసు డేమయ్యె"నని మరల ప్రశ్నించెను.

"ప్రవాహమున కొట్టుకొనిపోయి మరణించె"నని సేవకుడు చెప్పెను.

సువర్ణ కనులు మూతలుపడెను. శాశ్వత సుషుప్తి జెందిన ఆమె నయనములనుండి యశ్రుకణములు రాలెను.

* * * * *

ఓమ్ శాంతిః !

జామా తైలము

ఏజంట్లు కావలెను

తలనొప్పి, యిక్ఫ్లుయంజా, చేయి కాలు పట్టుకొనుట పంటినొప్పి మొదలగువ్యాధులను ఒక క్షణములో పోగొట్టగల ఖ్యాతిచెందిన "జామాతైలము" నకు సమమగు మందు వేరేదియు లేదు. చాలా యోగ్యతా పత్రములనుపొందియున్నది.

బుడ్డి 1-కి అణాలు 6 ఇచ్చి ఉపయోగించి చూడుడు

అమర్ చెందు, శోభాచెందు,

ఇంగ్లీషుమందులు, పలుసరకులు, సల్ఫ్యూరిక్, నైట్రిక్ మొరాటిక్ ఆసిడ్ల వ్యాపారస్థులు.

నెం. 63, నైనప్పనాయని వీథి, మద్రాసు